విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

సోమవారం 02 సెప్టెంబరు 2024 8 పేజీలు

'జల ప్రళయం'

- ఐదు చోట్ల బుడమేరుకు గండి..
- శనివారం అర్ధరాత్రి నుంచి నీటిలోనే శివారు ప్రాంతాలు
- అంబాపురం నుంచి వన్ టౌన్ వరకు...
- భవానీపురం నుంచి నున్న వరకు నీటిలోనే...
- ఆర్ఆర్‌పేట వద్ద రైలు పట్టాలపైకి వరద నీరు
- వరద ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, బుడమేరుకు పడిన గండితో విజయవాడ నగరం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది... గంట గంటకు ఉధృతి పెరుగుతుండడంతో ఇళ్లన్నీ నీటమునిగాయి... లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి... దీంతో నగర వాసులు ఇబ్బందిపడుతున్నారు...

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బెజవాడను బుడమేరు ముంచేసింది. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను జలదగ్బంధనం చేసింది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఇళ్లన్నీ నీట మునిగిపోతున్నాయి. జనం సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసు సిబ్బంది పడవల ద్వారా ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఐదు చోట్ల గండి..

భారీ వర్షాల కారణంగా ఈలప్రోలు వద్ద రెండు చోట్ల బుడమేరుకు గండి పడింది. అక్కడి నుంచి నీరు పోలవరం కాలువలోకి -మిగతా 2 లో ...

ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యల్లో సీపీ 2లో..

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ముంపు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు : కేంద్ర మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు పూర్తి స్థాయి లో అందిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా -మిగతా 2 లో ...

పునరావాస కేంద్రాలకు 2 వేల మంది : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో గత 24 గంటల్లో 24 మండలాలలో సుమారు వంద మిల్లి మీటర్ల వర్ష పాతం నమోదు అయిందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అన్నారు. జిల్లాలోని అచ్చంపేట మండలంలోని లోతట్టు ప్రాంతాలను ఆదివారం పరిశీలించిన -మిగతా 2 లో ...

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర-తెనాలి : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి పూర్తిస్థాయిలో కృషి జరగాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. ఉపాధ్యాయుడిగా అత్యుత్తమ సేవలు అందించిన కనపర్తి బెన్‌హర్ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని ఆయన రచించిన వ్యాసాలతో కూడిన 'అంతరాలు లేని సమాజం కోసం' పుస్తకాన్ని స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం లక్ష్మణరావు ఆవిష్కరించి -మిగతా 2 లో ...

రైతులను ఆదుకోవాలి

ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలి : రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-చల్లపల్లి : గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చేలు పూర్తిగా మునిగిపోయి రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేసారు. చల్లపల్లి, నడకుదురు, నిమ్మగడ్డ,మెకావారి పాలెం మంగళాపురం, మాజేరు భోగిరెడ్డిపల్లి గ్రామాలలో నాయకుల బృందం ఆదివారం పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులను తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేకమంది రైతులు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో తమ చేలన్నీ నీట మునిగిపోయినట్లు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు -మిగతా 2 లో ...

పునరావాస కేంద్రాలు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో కృష్ణ వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా కృష్ణా జిల్లాలో నది వెంబడి గ్రామాల లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ డీకే. బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల అధికారులతో ఆదివారం జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ సమావేశం నిర్వహించి జిల్లాలో -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

కల్పించారు. భారీ వర్షాలు వలన గుంటూరు తూర్పునియోజకవర్గం పరిధిలో ముంపుకు గురైన లోతట్టు ప్రాంతాలను ఆదివారం, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్‌తో కలసి పరిశీలించారు. పాతగుంటూరులోని ఎల్బీ నగర్, ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక, జూన్ షాహెద్ ప్రాంతాలలో పర్యటించారు. ప్రగతినగర్, జూన్ షాహెద్ ప్రాంతాల్లో వర్షం నీటిలోనే కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు నసీర్ నడుచుకుంటూ వెళ్ళి వర్షం నీరు చేరిన ఇళ్ళను పరిశీలించి, స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. భారీ వర్షాలు వలన జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పెమ్మసాని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ మధుసూదన్, డీసీపీ శ్రీనివాస్, తహశీల్దారు నగేష్, కార్పోరేటర్లు మహమూద్, చిష్టి, మీరావలి, టీడీపీ నాయకులు దేగల ప్రభాకర్, జాగర్లమూడి శ్రీనివాస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు 2 వేల మంది : కలెక్టర్

అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ అమరావతి, క్రోసూరు, నాదెండ్ల మండలాలు జలమయం అయ్యాయని అక్కడి ప్రజలను దగ్గరలోని జిల్లా పరిషత్ పాటశాల పునరావాస కేంద్రానికి తరలించి వారికి అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 6 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చయడం జరిగిందాన్నారు. సుమారు రెండు వేలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. వర్షం తగ్గే వరకు ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, బయటకు రావద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడ్డుతూ రాబోయే రెండు రోజులు ప్రజలు అప్రమత్తం గా ఉండాలన్నారు. కార్యక్రమములో ఎస్పీ శ్రీనివాసరావు, రెవిన్యూ డివిజినల్ అధికారి మురళి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పంటలు వేసుకున్న రైతాంగానికి గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. పంటచేలాన్ని చెరువులను తలపించే విధంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు పారే సౌకర్యం లేకపోవడంతో ఇంత నష్టం చవిచూడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతులకు ఎకరానికి 30 వేల వరకు ఖర్చయిందని, రైతుల కష్టం నీటిపాలైందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లోపం ఇంత నష్టానికి కారణం అని పేర్కొన్నారు. డ్రైనేజీ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతాంగం పాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం అంతరించి పోతున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యాలు రైతాంగాన్ని మరింత కుంగదిస్తున్నాయన్నారు. ఇలాంటి విపత్కర పరిణామాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని, అప్పుడే రైతు కోలుకుంటాడని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు రూ 25 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు నాయకులు పరుచూరి శ్రీనివాసరావు, వేము రత్నగిరి రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ రామారావు, మాలెంపాటి కోటేశ్వరరావు, డొక్కు శ్రీనివాసరావు, తలుపుల సుబ్బారావు, పెనుమత్స రాజారత్నం, చంద్ర సుబ్బారావు, నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

అనంతరం పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా వ్యవస్థలో రావలసిన మార్పులపై ప్రసంగించారు. సభకు దేవిరెడ్డి శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆదర్శ భావాలతో జీవనం గడిపి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన బెన్‌హర్ ధన్యజీవి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ ఒకప్పుడు సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఆన్‌లైన్ విశ్వవిద్యాలయం, డిజిటల్ తరగతులు ఇత్యాదివి వినేవారమని ప్రస్తుత ప్రభుత్వ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విద్యాలయాల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాట్లు తెలిపారు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ బెన్‌హర్ కుటుంబంలో తండ్రి నుండి సోదరుల వరకు అందరూ ఉపాధ్యాయ వృత్తిలోనే సేవలు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకుడు కనపర్తి కృపాదాసు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన కనపర్తి అబ్రహం, నాగరాజు, తెనాలి ఎమ్.ఈ.వో-2 జయంత్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు, జిల్లా ఆధ్యక్షుడు పెదబాబు, కనపర్తి మేరి రత్నకుమారి, బి. భాస్కర్, రావూరి శివకృష్ణ (ప్రజా సంఘాల ఐక్య వేదిక), దూల సందీప్ (అంబేద్కర్ సేవా ట్రస్ట్), బొల్లిముంత కృష్ణ (ఇస్కస్), చందు సుబ్బారావు (అభ్యుదయ కళాసమితి), వేము సమత (భారత్ బచావో), పినపాటి రవికుమార్ (జాషువ విజ్ఞాన సమితి), డి.వి. సుబ్బారావు (ఎస్.టి.యు), రమేష్ పట్నాయక్ (విద్యా పరిరక్షణ కమిటి), బండికళ్ళ సతీష్ (సచివాలయ ఉద్యోగుల సంఘం), బి. సుధాకర్ (చార్వాక ఆశ్రమం), అంగిరేకుల ప్రసాద్‌బాబు (మదర్‌థెరిస్సా సేవా సంస్థ), బి.వి. నారాయణ (డెవలప్ సొసైటి), దేవరపల్లి నీలాంబ్రం (ప్రజానాట్య మండలి) లోకం భాస్కరరావు, సత్యనారాయణ ప్రసంగించారు. ముందు ప్రజానాట్యమండలి వారు అభ్యుదయ గేయాలను, డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబు, బెజ్జంకి నాగమణి దేశభక్తి గీతాలను ఆలపించారు.

'జల ప్రళయం'

భారీగా చేరి పొంగి ప్రవహిస్తోంది. అదేవిధంగా కవులూరు శాంతినగర్ వద్ద మూడు చోట్ల బుడమేరుకు గండిపడింది. దీంతో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి వరద జక్కంపూడి, అంబాపురం గ్రామాలను ముంచేసింది. ఆ తర్వాత గంటగంటకు వరద పెరుగుతూ నగరంలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. ఇటు భవానీపురం హెచ్‌బీ కాలనీ, ఐరన్ యార్డ్ నుంచి ఊర్మిళానగర్, కబేళా, సితార సెంటర్, చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, వైఎస్సార్ సర్కిల్, కొత్త రాజరాజేశ్వరి పేట, రామకృష్ణాపురం, సింగ్ నగర్, పాయకాపురం, ప్రకాశ్ నగర్ నుంచి నున్న పవర్ గ్రిడ్ ప్రాంతం వరకు భారీగా వరద నీరు చేరింది. ఇళ్లన్నీ నీళ్లలోమునిగిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆయా ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేశారు. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. తాగు నీటి కోసం సైతం అల్లాడే పరిస్థితి నెలకొంది. అంబాపురం, కొత్త ఆర్ఆర్ పేటలో వరద ఉధృతి తీవ్రంగా ఉంది. అపార్ట్మెంట్లలోమొదటి అంతస్తు వరకు మునిగిపోయాయి. ఆదివారం ఉదయం వరద మరింత పెరిగి అంబాపురం నుంచి పాత రాజరాజేశ్వరి పేట, చిట్టినగర్, కేఎల్ రావునగర్, వించిపేట నుంచి పంజా సెంటర్ వరకు వదర నీరు చేరింది. రాజరాజేశ్వరి పేట వద్ద ఎర్రకట్ట దిగువన రైలు పట్టాలపైకి వరద నీరు చేరింది. వరద ముంపుప్రాంతాల్లో అధికారులు పడవలపై తిరుగుతూ సహాయక చర్యలు చేపట్టారు.

సీఎం పరిశీలన

సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం విజయవాడలోని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సింగ్ నగర్ ప్రాంతంలో సీఎం పర్యటించి వరద పరిస్థితిని గమనించారు. సహాయక చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. వరద ముంపు బాధితులను ఆదుకునే విషయంలో వెనుకాడవద్దని ఆదేశించారు.

ముంపు బాధితులకు సీపీఐ చేయూత

ఆహారం, మంచినీటి బాటిళ్లు పంపిణీ

ఓ వైపు భారీ వర్షాలు, మరో వైపు బుడమేర ఉధృతి.. ఊహకందని వరదలు.. ఎగువన కురిసిన వర్షాలతో విజయవాడకు వరద పోటెత్తిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం విద్యాధరపురం సీతార సెంటర్ నుండి కబేళా సెంటర్ వరకు పడవలో వెళ్లి ముంపు ప్రాంతా బాధితులకు ఆహారం, మంచినీటి బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. విజయవాడలోని కబేళా, భవానీపురం, సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట, పాయకాపురం, వించిపేట తదితర ప్రాంతాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయని అన్నారు. విద్యుత్తు స్తంభించిందని, . వారిని అదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వామే కాకుండ స్వచ్ఛంధ సంస్థలు కూడా ముందుకు వచ్చి ముంపు ప్రాంతాలను ఆదుకోవాలని కోరారు. టూరిజం ద్వారా బోటులు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు లంక గోవిందరాజులు, కంచర్ల భార్గవ్, పార్టీ నాయకులు మోకా దుర్గారావు, రాయన గుర్నాథం, శీల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యల్లో సీపీ

ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలను ఎన్టీఆర్ జిల్లా సీపీ ఎస్వీ. రాశేఖరబాబు పర్యవేక్షించారు. స్వయంగా ఆయనే విజయవాడ అజిత్‌సింగ్ ప్రాంతాల్లో అధికారులను సూచనలు చూస్తూ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఫైర్, పోలీసులు లా అండ్ అర్డర్ అధికారులు సిబ్బందితో లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టారు. నీట మునిగిన ప్రాంతా నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు, కొండ ప్రాంతాల్లో నివసించేవారు, శిధిలావస్థకు చేరుకున్న వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పురాతన ఇళ్లలో నివసించే వారి సైతం ముందస్తుగా చర్యలు తీసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని తెలిపారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

కురుస్తున్న వర్షాలు, కృష్ణానదికి వస్తున్న వరద ఉధృతి పై తీసుకోవలసిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లంక గ్రామాల ప్రజలను తరలించడానికి ప్రతి లంక గ్రామానికి ఒక్కొక్క బృందాన్ని, లంక గ్రామాలు ఎక్కువగా ఉన్న మండలానికి జిల్లా అధికారిని నియమించామన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లంకగ్రామ ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, అదికారులకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గతంలో ఎంత వరద వచ్చినా ఏమీ జరుగలేదని, ప్రజలు అపోహ పడవద్దని అన్నారు. జిల్లాలో మొత్తం 11 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇంకా అవసరమైతే పెంచుతామని అన్నారు. ఇప్పటికి సుమారు 650 మందిని పునరావాసాలకు తరలించారు. భారీ వర్షాలు, వరదలు కారణంగా సోమవారం పాఠశాలలకు, కాలేజీలకు సెలవు ప్రకటించారు.

ప్రమాదస్థితిలో ఎలమర్రు వంతెన



విశాలాంధ్ర-పెదపారుపూడి : పెదపారుపూడి నుండి ఈదుల మద్దాల మీదగా చినపారుపూడి, ఎలమర్రు వెళ్ళు ఆర్ అండ్ బి రహదారికి చంద్రయ్య కాలువ మీద వంతెన క్షీణించి ఉన్నది. గత మూడు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలకు కృంగిపోవడంతో అధికారులు వంతెనకు ఇరువైపులా అడ్డంగా బాదులు కట్టి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో టీ సీత మహాలక్ష్మి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ విషయమై గుడివాడ నుండి విజయవాడ ఆ మార్గంలో వెళ్ళు వాహనదారులు గమనించాలని ఎంపీడీవో వివరించారు.

ఫోన్‌తో అధికార యంత్రాంగం పరుగులు

విశాలాంధ్ర-గూడూరు: పెడన నియోజకవర్గం గూడూరు మండలం లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిట మునిగిన పంట పొలాలను గూడూరు మండల పార్టీ అధ్యక్షులు పోతన స్వామి పరిశీలించారు మండలంలోని ముక్కొల్లు కంకటవ తలకటూరు గ్రామాల్లో ప్రధానంగా పంట పొలాలకు నీరు అందిస్తున్న లజ్జ బండ డ్రైన్ కాలములో గుర్రపు డెక్క పేరుకు పోయి నీటిపారుదల లేక పంట పొలాలు నీట మునిగే పరిస్థితి ఏర్పడిందని గ్రహించి స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఫోన్లు వివరించారు స్పందించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కృష్ణా జిల్లా కలెక్టర్‌కి గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో డ్రైన్ కాలువలు నాన్ డ్రైన్ కాలువలు పూడికపోయి నీటిపారుదల లేక పంట పొలాలు నీటి మునిగే పరిస్థితి ఏర్పడుతుందని కలెక్టర్ కి ఫోన్ ద్వారా వివరించారు స్పందించిన కలెక్టర్ బాలాజీ అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు గూడూరు మండలంలోని రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ సంబంధించిన అధికారులు తక్షణమే మండలంలోని తరగటూరు ముకోల్లు కంకటవ లజ్జబండ డ్రైన్ కాలువలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులకు సూచించారు అనంతరం తలకటూరు హైవే పక్కన గల డ్రైనేజీ కాలువ తవ్వించారు.

చెరువులను తలపిస్తున్న పంటచేలు

విశాలాంధ్ర-చల్లపల్లి: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు కురిసిన భారీ వర్షాలతో పంటపొలాల్లో ఎటుచూసినా వర్షపునీరే దర్శనమిస్తోంది. కుండపోత వర్షానికి పంటచేలు నీటిముంపుకు గురయ్యాయి. కొన్నిచోట్ల మురుగుబోదెలు, పంటచేలు ఒక్కటిగా మారి చెరువులను తలపిస్తున్నాయి. చల్లపల్లి మండలం వక్కలగడ్డ, మాజేరు, మంగళాపురం గ్రామాల్లో ఎక్కువగా పొలాలు ముంపుబారిన పడ్డాయి. పాగోలు, మేకావారిపాలెం, రాముడుపాలెం తదితర గ్రామాల్లో పల్లపు చేలు చెరువులను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల మురుగుబోదెలు పూడుకుపోయి ఉండటం, కొన్ని మేజర్ డ్రైన్లలో గుర్రపుడెక్క అక్కడక్కడా ఉండటంతో వర్షపునీటి పారుదల వేగంగా జరగటంలేదు. రేవులోనూ వరదప్రవాహం సాగుతుండటం, అమావాస్య రోజులు కావటంతో కృష్ణానదిలో కలిసే మురుగుకాల్వల్లో నీరు వేగంగా ముందుకు సాగదనీ, దీంతో పొలాల్లో నీరు పోవటం కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం నుండి వాతావరణం తెరపు ఇవ్వగా, వర్షాలు కురిసే అవకాశం ఉందనే వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడితో వర్షం ఆగితే వర్షపునీరు బయటకు మళ్లుతుందనీ, పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని వర్షాలు కొనసాగితే నష్టాలు తప్పవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట పొలాలను పరిశీలించిన డిప్యూటీ తహశీల్దార్

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: భారీ వర్షాలకు మండలంలోని గ్రామాల్లో డ్రెయిన్లు, కాలువలు పొంగి పొర్లి పంట పొలాలు జలమయమవ్వగా ఆదివారం డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ మరియు రెవెన్యూ సిబ్బంది మండలంలోని వడ్లమన్నాడు, వేమవరం, రెడ్డిపాలెం, కౌతవరం, పసుబొట్ల పాలెం, వేణుతురుమిల్లి, పురిటిపాడు, చిన్నాగొన్నూరు మొదలగు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వర్షాల వలన నీట మునిగిన పొలాలలో నీటిని తొలగించడానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వడ్లమన్నాడు గ్రామంలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్న కాలువ తూడు తో పుడుకుపోయి ఉండటంతో దానిని వెంటనే తొలగించే విధంగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లోని స్థానిక జేమ్స్ పేట, ఇందిరానగర్, చంద్రన్న కాలనీ, జగనన్న కాలనీలను సందర్శించి వర్షపు నీటిని తొలగించేలా పంచాయితీ సిబ్బందికి సూచనలు చేశారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-పెడన: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో ఉన్న పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అవటంతో యుద్ధ ప్రాతిపదికన వెంటనే వర్షపు నీటిని తరలించే పనులు ప్రారంభించామని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శ్రీ రామలక్ష్మి వీవర్స్ కాలనీ, మరియు దక్షిణ తెలుగు పాలెం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆహార విషయాలను దగ్గరుండి చూసుకోవాలని సురక్షిత ప్రాంతాలకు వారిని తరలించాలని అధికారులను ఆదేశించారు. అంతేగాక మోటార్ల సహాయంతో వర్షపు నీటిని తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపాలరావు వివిధ వార్డుల టిడిపి ఇన్చార్జులు,టిడిపి నాయకులు, పరసా జితేంద్ర తదితరులు ఉన్నారు.

గంగా సుబ్బయ్య కుటుంబానికి సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-మచిలీపట్నం : గూడూరు మండలం పోలవరం గ్రామ సీపీఐ ప్రముఖులు నాయకులు జాగబత్తుల గంగ సుబ్బయ్య కుటుంబాన్ని సీపీఐ నాయకులు పరామర్శించారు. గంగ సుబ్బయ్య వృద్ధాప్యంలో కొంతకాలంగా తన కుమారుడు ఇంట విజయవాడలో ఉన్నారు. ఆయన పోలవరం గ్రామంలో మృతి చెందారు. గ్రామంలో యువజన సంఘం నిర్మాణం, ప్రజా మండలితో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. చేనేత కార్మిక సంఘ నిర్మాణం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది, ది పోలవరం రివర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా అనేక నూతన పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఈయన సొంతం. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, పెడన నియోజవర్గ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతం, పెడన పట్టణ కార్యదర్శి చిన్న కొండయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు మోదుమూడి అరుణకుమారి, సీపీఐ నాయకులు జాగా బత్తుల కోట సుబ్బా నాగమ్మ, గంగా శ్యామలరావు, చంద్రశేఖరరావు, రవి, పిచ్చిక సోమేశ్వరరావు, కొండేటి బాబురావు, బల్ల కోట భ్రమరాంబ ఉన్నారు.

30 మందిని కాపాడిన అధికారులు

విశాలాంధ్ర-కంచికచర్ల: కృష్ణా నదికి వరద ఉధృతి గంట గంటకు పెరుగుతుండటంతో లంకల్లో ని,నది పరివాహక ప్రాంత ప్రజలను రెవెన్యూ పోలీసు సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీ వర్షాలకు కంచికచర్ల మండలం పరిసర ప్రాంతాల్లో వాగులు వంకలు పొంగి ప్రవ హిస్తున్నాయి. దీంతో మండలంలో కృష్ణా నదికి పరివాహ ప్రాంతాలైన మొగులూరు, చెవిటికల్లు, ఆతుకూరు, కొత్తపేట గ్రామాల ను వరద నీరు చుట్టుముట్టే అవకాశం ఉన్నందున అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.గని ఆతుకూరు లంక భూములను ఇప్పటికే వరద నీరు చుట్టుముట్టడం తో లంకల్లో ఉంటున్న 30 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి : యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున గన్నవరం నియోజకవర్గంలోని అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు , తెలుగు యువత సహాయక చర్యల్లో పాల్గొనాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్, ఉంగుటూరు, గన్నవరం, బాపులపాడు మండలాల్లో అనేక గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో పంట పొలాలు , రోడ్లు పూర్తిగా నీటమునిగాయి . ఈ మేరకు గన్నవరం నియోజక వర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో పరిస్థితిని నేరుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుల తో మాట్లాడి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు . తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా దృష్టిపెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది సహకారంతో వరద నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైళ్లపై తీవ్రమైన ప్రభావం చూపిన భారీ వర్షాలు

-కాజీపేట వైపు రైళ్ళ సర్వీసులు బంద్-పలు రైళ్ళు దారి మళ్లింపు

-ప్రయాణికులు అవస్థలు-పలు రైల్వేస్టేషన్‌లలో సమాచార కేంద్రాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రైళ్ళ రాకపోకలపై తీవ్రమైన ప్రభావం చూపటంతో ఎక్కడక్కడ రైళ్ళను నిలిపివేసి పరిస్థితిని బట్టి ముందుకు నడుపుతున్నారు. వర్షాలు తగ్గుముఖపట్టడంతో పలు చోట్ల వరద రావటంతో రైల్వేట్రాక్‌పై నుండి ప్రవహిస్తుంది దాంతో రైలు పట్టాలు కొట్టుకుపోతున్నాయి.రాయనపాడు వద్ద పట్టాలపై నీరు చేరడంతో లు రైళ్ళను అక్కడ నిలిపివేశారు.అక్కడ నిలిపివేసిన న్యూఢిల్లీ-చైన్నై ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ప్రయాణికులను దించివేసి విజయవాడకు బస్సులో తరలించారు.ఇక్కడ నుండి మరో రైలులో చైన్నైకు పంపించారు. అలాగే తెలంగాణలో ఉన్న మహబూబాబాద్ సమీపంలో అయోధ్య గ్రామంలో చెరువుకట్ట తెగిపోవటంతో ఇంటికన్నె-కేసముద్రం మధ్య రైల్వేట్రాక్ కొట్టుకుపోయ్యింది.దాంతో కాజీపేట వైపు ఏ రైలు కదలేదు.ఇప్పటికే విజయవాడ డివిజన్ పరిధిలో పలు పాసింజర్ రైళ్లను రద్దు చేసింది. నేడు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళను భద్రతా కారణాల రీత్యా వీటిని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఆది, సోమ,మంగళవారం వరకు పలు రైళ్లు రద్దయ్యాయి.మరికొన్నింటిని దారి మళ్లించారు. మరికొన్నింటిని పాక్షింకంగా రద్దు చేశారు.దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు డివిజనల్ కార్యాలయంలో అధికారులు 24 గంటలు పరిస్థితిని సమిక్షిస్తూ అవసరమైన సూచనలు,సలహాలు అందజేస్తూఆన్నరు. ఎటువంటి పరిస్థితినైన ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. రాగల 2 రోజులు ఇదే పరిస్థితి ఉన్నందున అవసరమైతేనే ప్రయాణాలు చేయటం మంచిది సూచిస్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించటానికి లు రైల్వేస్టేషన్‌లలో హెల్ప్‌లైన్ నెంబర్‌లను ఇ్వటంతో పాటు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి దానిని సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన సమాచారం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రయాణికులు దారిమధ్యలో అగిఓతే ప్రయత్నామ్య ఏర్పాటు చేస్తున్నామని అలాగే అవసరమైన ఆహారం,మంచినీళ్ళు,పాలు అందజేస్తున్నామన్నారు. ప్రయాణికులు తమ ప్రయాణం రద్దు చేసుకున్న వారికి పూర్తిగా డబ్బు వాపసు చేస్తున్నామన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో రావి పర్యటన

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: వాయు గుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుడివాడ నియోజకవర్గంలో పొంగిపొర్లుతున్న ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలను టిడిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. మండలంలోని వడ్లమన్నాడు, కౌతవరం, డోకిపర్రు, ఉలవల పూడి గ్రామాల్లో ప్రధాన కాలువలతో పాటుగా పంట బోదెలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకుడు తులసి బాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలు, బోధల్లో నీటి ఉధృతిని గమనించిన నేతలు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రైతులు తమ సమస్యలను నేతల దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వడ్లమన్నాడు గ్రామంలో డ్రైనేజీ ఈ.ఈ విజయలక్ష్మి, మురళీకృష్ణ లకు వరి పొలాలు మునగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మాజీ ఎమ్మెల్యే రావి, టిడిపి నాయకులు పలు సూచనలు చేశారు. వడ్లమన్నాడు డ్రెన్‌లో తూడు, కాడ తొలగింపు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రభావంతో ఏ చిన్న సమస్య తలెత్తిన అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు టిడిపి నాయకులు సూచించారు. ఈ పర్యటనలో గుడివాడ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్ రావు, ఈడే కృష్ణమోహన్, సుబ్రహ్మణ్యం, రాంబాబు, అంకాలరావు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు,ఇరిగేషన్ మరియు డ్రైనేజీ, రెవెన్యూ,పంచాయతీ శాఖల అధికారులు,పలు గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

లంకపల్లి కరకట్టపై ఉన్న 21 మంది తరలింపు

విశాలాంధ్ర-పమిడిముక్కల: కృష్ణానది కి వరద ఉధృతి గా ఉండటంతో ఏటిఒడ్డు గ్రామాలైన లంకపల్లి ఐనపూరు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలియపరచాలని తహశీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు. ఆదివారం లంకపల్లి కరకట్ట పై నివాసం ఉంటున్న 21 మంది స్థానిక పాఠశాలలోకి పురావసన కేంద్రానికి తరిలించామన్నారు. కపిళేశ్వరపురం, ముళ్ళపూడి ఐనంపూడి వేల్పూరులోని పోలాలు చెరువులు తలపిస్తున్నాయి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామారావుకు పుత్రవియోగం

-ఏపీయూడబ్ల్యూజే సంతాపం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ పూర్వ అధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.రామారావు కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గిరీష్ ఆకస్మికంగా మృతి చెందాడు. గిరీష్ మృతికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఐ.వి సుబ్బారావు, చందు జనార్ధన్, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచెల జయరాజ్, దాసరి నాగరాజు ఐజేయు కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, సిహెచ్ రమణారెడ్డి, విజయవాడ అర్బన్ యూనిట్ కార్యవర్గ సభ్యులు, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో గిరీష్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని రామారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోమవారం ఉదయం మొగల్రాజపురం ఆర్ఆర్ చికెన్ సెంటర్ వద్ద ఉన్న రామారావు ఇంటి వద్ద నుంచి గిరీష్ అంతిమయాత్ర బయలుదేరుతుందని తెలిపారు.

గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు

- మాజీ మంత్రి పేర్ని నాని కారుపై దాడి

- పవన్ కల్యాణ్‌కు క్షమపణ చెప్పాలి - జనసేన నాయకులు

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి, మాజీ మంత్రి పేర్ని నాని గుడివాడ వచ్చినట్లు తెలసుకున్న జనసేన నాయకులు అయన పయనించి కారు అద్దలు పగాలకోట్టారు, కారుపై పోట్రోలు కూడ పోసి నిప్పు పెట్టేందుకు ప్రయాత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పేర్ని నాని వెంటనే జనసేన అధినేత పవన్ కాల్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని జనసేన నాయకులు డిమాండ్ చేయడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తకు నెలకోన్నాయి. మాజీ మంత్రి పేర్ని నాని ఆదివారం స్థానిక 1టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇటివల ఫోటోలు మార్ఫింగ్‌కు పాల్పడుతున్న వైసిపి కార్యకర్త ఇంటూరి రవికిరణ్ అరెస్ట్ చేసి విషయంలో విడిపించేందుకు వచ్చారు. ఇటివల ఇంటూరి రవికిరణ్ అత్యంత జుగుప్సాకరంగా ఏపీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫోటోలు మార్ఫింగ్ చేస్తూన్న వైసిపి కార్యకర్తపై గుడివాడకు చెందిన అసిలేటి నిర్మల ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేసారు. దానిలో భాగంగా ఈ కేసును విచారించిన గుడివాడ 1టౌన్ పోలీసులు ఇంటూరి రవికిరణ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని గుడివాడలోని పోలీసు స్టేషన్‌కు తీసుకు వాచ్చారు. ఈ విషయమై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టినందుకు పోలీసులు అదుపులో ఉన్న వైకాపా కార్యకర్తను పరామర్శించేందుకు వచ్చినా పేర్ని నాని రావడం జరిగింది. అనతరం రాజేంద్రనగర్ లోని వైకాపా నేత శివాజీ ఇంటికి వచ్చిన పేర్ని నాని విషయం తెలుసుకున్న జనసేన కార్యకర్తల అక్కడ ఆందోళన చెప్పాట్టారు. ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో జనసేన నేతలను పోలీసులు అదుపులకు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొంత మంది జనసేన నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గుడివాడ నుండి పారిపోయిన పరిస్థితిలో పేర్ని నాని ఏ విధంగా గుడివాడ వచ్చాడన్నారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో విఘాదాలు సృష్టించేందుకే పేర్ని నాని గుడివాడ వచ్చాడన్నారు. క్షమాపణ చెప్పకుండా గుడివాడ నుంచి వెళ్ళనిచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు. మహిళలను అవమానపరిచేలా పోస్టులు పెడుతున్న వ్యక్తిని పరామర్శించేందుకు పేర్ని నాని గుడివాడ రావడం దౌర్భాగ్యంమన్నారు. అధికారంలో ఉండగా మహిళలను దారుణంగా అవమానించి, ఇప్పుడు అవమానించే వారికి కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. రెండు చెప్పులతో పవన్ కళ్యాణ్ విమర్శిచావు, ఇప్పుడు ఇక్కడ 36 చెప్పులు ఉన్నాయన్నారు. పేర్ని నానిపై తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కొంత మందిని అదుపులోకి తీసుకుని, రాత్రి సమయంలో పేర్ని నానిని పోలీసుల బందో బస్తుతో మచిలీపట్నం తరలించారు.

విశాలాంధ్ర

అష్టదిగ్బంధం

ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

- ఉధృతంగా కృష్ణమ్మ
- ఉగ్రరూపం దాల్చిన మునేరు
- అష్టదిగ్బంధనంలో పట్టణాలు, గ్రామాలు
- పొంగిపొర్లుతున్న వాగులు
- నిలిచిన గ్రామాలకు రాకపోకలు
- నిలిచిన విద్యుత్ సరఫరాలు
- అల్లాడుతున్న ప్రజలు
- సహాయక చర్యల్లో అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలు చిగురుటాకుల వణుకుతున్నాయి... కాల్వలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి... లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి... దీంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి... విద్యుత్ లేక రాత్రుళ్లు విషసర్పాలతో అల్లాడుతున్నారు... పాలకులు, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు..

అష్టదిగ్బంధనంలో తిరువూరు

విశాలాంధ్ర-తిరువూరు: వర్షాలతో ఆదివారం జలదిగ్బంధంలో తిరువూరు ఉంది. ఎటు చూసినా వరద నీరే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, జాతీయ రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఉగ్రరూపం దాల్చిన మునేరు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : భారీ వర్షాలకు పెనుగంచిప్రోలు మునేరు ఉగ్రరూపం దాల్చింది. బ్రిడ్జ్‌పై మూడు అడుగులకు చేరిన వరదనీరు, లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. పడమర బజారు దళిత వాడ. వడ్డిర పల్లె, పద్మశాలివాడ, రజకపేట. మూతరాసి పల్లె. తూర్పు బజారు రెండు దళిత వాడ లోకి. అలాగే శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ప్రాంగణంలోకి భారీగా వరదనీరు వచ్చింది.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ అర్జున్

పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అర్జున్ సూచించారు. ప్రజల ఇబ్బందులు వారి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు వచ్చే క్రమంలో చెరువు వాగుకు వచ్చే వరద ఎక్కువ అవటం చేత పెనుగంచిప్రోలు ఎస్సై జీబును టాక్టర్కుకీ కట్టి పెనుగంచిప్రోలులోకి తీసుకురావాల్సిన పరిస్థితి ఎదురైంది. ఎస్సై అర్జున్ మాట్లాడుతూ అవసరమైతేనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలని, బయటకు వచ్చి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దన్నారు.

మునేటికి వరద ఉధృతి

విశాలాంధ్ర-వత్సవాయి : వర్షాలకు మండలంలోని ఏరులు వాగులు వంకలు ఉగ్రరూపం దాల్చి పొంగి పోరిలాయి తుఫాను హెచ్చరిక జారీలను స్థానిక తహసీల్దార్ నరసింహారావు మునుపెన్నడు లేని విధంగా లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేసి దబ్బాకుపల్లి లింగాల గ్రామాలలో వర్షానికి గృహలలో నీరు చేరడం తో వారిని గుర్తించి నివాసం కల్పించి భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. పోలీసు వారు మునేటి వద్ద పహార కాయగా రెవిన్యూ సిబ్బంది అప్రమత్తంగా వ్యాహరించి ముందస్తు ప్రణాళికతో తహసీల్దార్ కార్యాలయం లోనే ఉంటూ అర్ధరాత్రి సైతం జేసీబీ తో గండ్లు కొట్టించి ఎటువంటి అవాంఛనియా సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడంతో తహసీల్దార్ నరసింహరావు మండల ప్రజల అభినందిస్తున్నారు.

ముంపులో 23 గ్రామాలు

విశాలాంధ్ర-తిరువూరు: భారీ వర్షాలకు తిరువూరు కట్టలేరు బ్రిడ్జి, అక్కపాలెం మల్లమ్మ చెరువు, మునుకుళ్ళ పోతుల చెరువు, తిరువూరు పటణం, పాత తిరువూరు, రాజుపేట, గానుగుపాడు, ఎర్రమాడు, చింతలపాడు, ఆంజనేయపురం, కాకర్ల, మల్లేల, అక్కపాలెం, మునుకుళ్ళ, వామకుంట్ల, ఎరుకోపాడు, కొమ్మిరెడ్డిపల్లి, ముష్టికుంట్ల, లక్ష్మీపురం, కోకిలంపాడు, రామన్నపాలెం, చిట్యాల, చౌటపల్లి, వావిలాల, రోలుపడి, రామన్నపాలెం, 23 గ్రామాలు నిండుకుండల్లా మారిన చెరువులు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జలదిగ్బంధంలో ఎడ్లంక

విశాలాంధ్ర-అవనిగడ్డ : భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద నీరు పోటెత్తడంతో మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఇటీవల కోతకు గురైన కాజ్ వే ను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచనల మేరకు పునరుద్ధరించినప్పటికీ శనివారం వరద ప్రవాహానికి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో పాత ఎడ్లంకకు రాకపోకలు ఆగిపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీట మునిగిన పొలాలు

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షంతో వరి పొలాలు ముంపుపాలైనాయి.మొవ్వ మండలంలోని కూచిపూడి, పెదపూడి, మొవ్వ కాజ, పద్దారాయుడు తోట, చినముత్తేవి, అవురుపూడి, పాలంకిపాడు, మంత్రి పాలెం, నిడుమోలు, వీరాయిలంక తదితర ప్రాంతాలలో

వందలాది ఎకరాలు వర్షపు నీటిలో మునిగాయి. మొవ్వ మండలంలోని మేజర్ డ్రైన్లు అయిన అయినంపూడి, భీమ నది, ఉప్పాయి కోడు లతోపాటు మైనర్ డ్రైన్ లో కూడా నీరుకట్టలకుఎగతన్నింది. ఈ దశలో అయినంపూడి డ్రైన్ నిండుకుండలా ప్రవహించటంతో పొలాల్లో నీరు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. నీటమునిగిన పొలాల రైతులను ఆదుకోవాలని పొలాలను పరిశీలించిన జిల్లా కౌలు రైతుసంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు బృందండిమాండ్ చేశారు.

వర్షపు నీటిలోనే జగనన్న కాలనీలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని జగనన్న కాలనీలు వర్షపు నీటికి నిలయాలుగా మారాయి. దీనిలో భాగంగానే పెదపూడి కాలనీ పరిస్థితి దారుణంగా ఉంది. రహదారుల పైకి నీరు చేరుతున్నాయి.

వరద ముంపు ప్రాంతంలో పర్యటించిన జనసేన నేత శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలో భారీ వర్షాలకు చైతన్య నగర్ తండా లో గృహాల్లోకి వరద నీరు చేరడంతో ఈ విషయాన్ని స్థానిక జనసేన సైనికులు భూక్య శివ భూక్యా చిరంజీవి శ్రీనివాస్‌కు తెలియజేయగా. ఆదివారం ఉదయం చైతన్య నగర్ తండాలో ప్రతి ఇంటికి వెళ్లి వరదపుకు గురైన బాధితులతో మాట్లాడి తక్షణమే మండల పరిషత్ అధికారులకు తహసిల్దార్ స్థానిక ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ కు విషయాన్ని తెలియజేసి బాధితులకు అండగా నిలిచి బాధితులకు అందాల్సిన సహాయం గురించి ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నందకుమార్ ఆర్ ఐ దివ్య ప్రసాద్ ఈఓపిఆర్డి శ్రీకృష్ణ పరమాత్మ విఆర్ఓ రవి భూక్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు గండి

విశాలాంధ్ర-కంచికచర్ల: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అతిభారీ వర్షాల కారణంగా కంచికచర్ల మండ ల పరిధిలోని పరిటాల చెరువుకు భారీగా వరద నీరుచేరడం వలన పరిటాల చెరువుకట్టకు గండి పడటం

తో వెంటనే పరిటాల ఎంపీటీ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి ఆదివారం చెరువు కు మరమ్మతులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు మాగంటి బాబు, మాగంటి చిన్న పుల్లారావు, మాగంటి అబ్బాయి, నెమలి పురి గాంధీ, కోగంటి నానిలు పాల్గొన్నారు.

వరద బాధితులకు పునరావాసం

విశాలాంధ్ర-కంచికచర్ల: భారీ వర్షాలు కారణంగా మొగులూరు గ్రామాన్ని వరద నీరు ముంచేతడంతో గ్రామంలో వరద ముంపుకు గురైన ప్రజలను స్థానిక ఎస్టి కాలనీలోని స్కూల్‌లో పునరావాస కేంద్ర ఏర్పాటు చేసి వారికి భోజన సదుపాయాలను మాజీ వైస్ ఎంపీపీ వెలగా నరసింహా రావు, డి ఏ పి, మాజీ తెలుగు యువత నాయకు లు వెలగా శ్రీనివాస రావు, మైనార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, ఏర్పాటు చేశారు.

పునరావాస శిబిరానికి తరలింపు

విశాలాంధ్ర-వీరులపాడు : వర్షంతో మండలం అతలాకుతలమయినది. మండలంలోని వెల్లంకి గ్రామంలో ఎస్సీ కాలనీ లోకి నీరు ప్రవేశించడంతో సుమారు 30 కుటుంబాలను పునరావాస శిబిరం కి తరలించినట్లు తహశీల్దార్ రాజకిషోర్ తెలిపారు. కొంత మంది శిబిరం కి రావటానికి నిరాకరంచడంతో వారిని మొబిలైజ్ చేసి శిబిరానికి పంపినట్లు తహశీల్దార్ తెలిపారు. నిరాశ్రయులైన వారందరికీ అల్పాహార, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జుజ్జూరులో గోకరాజుపల్లి రోడ్డులో గుదే వెంకటేశ్వరరావు ఇంటి ప్రహరీ గోడ కూలినది. వెల్లంకి నుండి కొణతాలపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

బుడమేరు పొంగి రైతులకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర-గుడివాడ : మరో 2రోజులు వర్షాలు కురిస్తే రైతులు పంట నష్టపోవడం జరుగుతుందని తక్షణమే అధికారులు స్పందించి బుడమేరు పరిసర ప్రాంతలలో ఉన్న రైతులను అదుకోవలని వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సుభాస్‌చంద్రబోసు(సురేష) అన్నారు. ఆదివారం నందివాడ మండలం పుట్టగుంట వద్ద బుడమేరు వంతెనపై నుండి పొంగి ప్రవహిస్తునడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఈ ఘటన వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఏలూరు, హనుమాన్ జంక్షన్ వెళ్లాలనుకునేవారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాకరాల బుడమేరు పరిస్థితిని పరిశీలించి, కొన్ని ప్రాంతాలలో వరినాట్లు పూర్తిగా మునిగిపోవడంతో అవేదన వ్యక్తం చేశారు. అయన వెంట టిడిపి నాయకుడు సూరపనేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌పురంకాలనీలో రోడ్లు

విసలాంధ్ర-గన్నవరం : భారీ వర్షాలకు మండలంలోని కేసరపల్లి వీఎన్‌పురం కాలనీ లో మునిగిపోయిన రోడ్లను జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి తదితరులు ఆదివారం పరిశీలించారు. కాలనీలోని సుమారు 50 అంతర్గత రోడ్లు జలమయం కావడమో, నడవడానికి వీల్లేని చిత్తడిగా మారడమో జరిగాయి. దీనితో కాలనీ వాసులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆమె వెంట వైసీపీ నాయకులు విష్ణు వర్ధనరావు, ఎంపీటీసీ సభ్యులు తిరువీధి రవి, పలువురు వైసీపీ కార్యకర్తలు ఉన్నారు.

భారీవర్షం...స్తంభించిన జనజీవనం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలో భారీవర్షంతో జనజీవనం స్తంభించింది. విస్సన్నపేట నుంచి తిరువూరు, నూజివీడు, రెడ్డిగూడెం, మైలవరం, ఎ.కొండూరు మండలాలకు వెళ్లే రహదారులన్నింటినీ వాగులు ముంచెత్తటంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లో వరి పంట నీట మునగగా, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు పొంగుతున్న వాగులను, దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. పుట్రేల, మల్లేల గ్రామాల మద్య, కుమ్మరికుంట్ల, ఎ.కొండూరు, నూజివీడు, రెడ్డిగూడెం మండలాల్లో రహదారులపైకి వరద నీరు చేరటంతో ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సులతో సహా వాహనాలను నిలిపివేశారు.

కిక్కిరిసిన దేవాలయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక గోరంట్ల అన్నపూర్ణ నగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి సొసైటీ దేవస్థానం (పెద్ద గుడి) శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా అశేష జనవాహినితో కిటకిటలాడింది. వేకువ జామున నిత్య పూజలు..అనంతరం విశ్వక్సేన పూజలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు దంపతులచే అమ్మ వారికి సార సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా గత నెల రోజులుగా ప్రతి శుక్రవారం 300 నుంచి 500 మంది వరకు మహిళలు వరలక్ష్మి పూజలలో పాల్గొని దేవాలయానికి పవిత్రతను, ప్రతిష్టను ఇనుమడింప చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు యర్రంశెట్టి వేణుగోపాల్, సభ్యులు గజవల్లి శివన్నారాయణ, ఆళ్ల శివారెడ్డి, కేవీరెడ్డి, దేవరశెట్టి సురేష్, జల్లేపల్లి మునలయ్య, పూసల శివయ్య, కటకంశెట్టి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తూటి కాడ తొలగింపు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఆదివారం తాడేపల్లి ఉండవల్లి గృహాల వద్ద కొండవీటి వాగులో పేరుకుపోయిన తూటి కాడను ఇరిగేషన్ అధికారులతో కలిసి తెలుగు యువత రైతులు జేసీబీతో ట్రాక్టర్లను ఏర్పాటుచేసి తొలగించారు. ఈ సందర్భంగా తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు రైతులు కొండవీటి వాగు తూటి కాడను తొలగించడం జరిగిందని తెలిపారు. కొండవీటి వాగులోని తూటి కాడను తొలగించడం వల్ల ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, పంట పొలాలలోకి వరద నీరు చేరకుండా ప్రవాహాన్ని కొండవీటి వాగులోకి మళ్లించి తద్వారా కొండవీటి నుంచి బకింగ్‌హామ్ కెనాల్ అలాగే పంపు హౌస్ ద్వారా నదిలోకి వదలడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సిగిరిశెట్టి రాజా రమేష్, రాము, గొర్రాల మణికంఠ లీలాకృష్ణ, సంకా బుచ్చి బాబు, శివుడు, రామారావు, కపిల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం కాలయాపనపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-దుగ్గిరాల : తుంగభద్ర కాలువపై నూతన వంతెన నిర్మాణంలో రెండు సంవత్సరాలుపైబడి కాలయాపనకు కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టి నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయాలని, యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ రవాణా మార్గం ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాదిగ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు వరదలకు వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన అడ్డుకట్ట నీటి ఉధృతికి కొట్టుకుపోవడం వంతెన ప్రాంతం నుంచి రైల్వే ట్రాక్ వరకు వాగు కాల్వ మరమ్మత్తులు చేయకపోవడం నూతన వాగు కాల్వ కట్టలు అభివృద్ధి చేయకపోవడం వలన సదరు వాగు పొంగి జానావాసాల్లోకి అధికంగా నీరు చేరడం వలన మాదిగ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ రవాణా మార్గం లేకపోవడం వలన మిగిలిన సమాజంతో సంబంధాలు తెగిపోయాయని, పంట పొలాలు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.

46 రోజులైనా ఫిర్యాదు పట్టించుకోరా..?

డీడీపై విజిలెన్స్ విచారణ చేయించాలి

బందెల నాసర్ జీ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావుపై తక్షణమే విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్ రావుపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, గతంలో కూడా అతనిపై ఏసీబీ కేసు నమోదు చేశారని, కేసు ముగిసే వరకు ప్రధాన బాధ్యతలు ఇవ్వకూడదని నిబంధన ఉన్నా కూడా ఆనాడు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న వారితో మాట్లాడుకొని సోషల్ వెల్ఫేర్‌తో పాటు బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. ప్రతి నెలలో కనీసం 20 హాస్టల్స్ పర్యవేక్షించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని... కానీ డీడీ మధుసూదన్ రావు ఇప్పటివరకు ఎన్ని హాస్టల్స్ పర్యవేక్షించారని ప్రశ్నించారు. కనీసం జిల్లా కార్యాలయంలో వారంలో రెండు రోజులు కూడా ఉండరని అన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసే క్రమంలో అభ్యర్థుల వయోపరిమితి ప్రకారం భర్తీ చేయాల్సి ఉంటే కొంతమంది అభ్యర్థులు దగ్గర లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని అభ్యర్థుల మార్కులు ప్రకారం పోస్టులు భర్తీ చేశారని, ఇందులో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, రాష్ట్ర అధికారులను కలిసి ఫిర్యాదు చేసి 46 రోజులు దాటిన ఇంతవరకు విచారణ చేయలేదంటే సామాన్యులకు ఈ అధికారులు ఏమి న్యాయం చేస్తారనే ప్రశ్నపై ప్రజల్లో చర్చ జరుగుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ, విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. విచారణ చేయకుండా కాలయాపన చేస్తే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలి : సీఐ

విశాలాంధ్ర-మేడికొండూరు: రాబోయే గణేష్ ఉత్సవాలలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా శాంతి కమిటీలు ఏర్పాటు చేసి ఉత్సవాలను సజావుగా జరపాలని మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ తెలిపారు. ఆదివారం పంచాయతీ ఆవరణలో గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఉత్సవాలలో ఎలాంటి కులమత వివాదాలు లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. గణేష్ మండపాలు పెట్టేందుకు ముందస్తుగా పోలీసు, పంచాయతీ శాఖల అనుమతులు తీసుకొని గణేష్ మండపాలు పెట్టుకోవాలని తెలిపారు. మండపాలలో నిత్యం కాపలదారులను నియమించి కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని అన్నారు. నిమజ్జన సమయాన్ని ముందుగా పోలీసు వారికి తెలియజేసి ఆ సమయంలో ఉపయోగించే వాహనాలతో పాటు మైకులు పోలీసు శాఖ నుండి తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ఏ విధమైన అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని సీఐ తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడుతూ ఇతర ప్రార్ధన ఆలయాల వద్ద ఎలాంటి డప్పు చప్పుడులు చేయరాదని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే లక్ష్యం: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉద్యోగుల నుంచి ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేవరకూ ఎస్టీయూ పోరాటం చేస్తుందని ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు గుంటూరు కలెక్టరేట్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో 2004 జనవరి 1 నుంచి ఎన్‌పీఎస్‌ను, రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్‌ను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్థానంలో అమలు చేస్తారన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అనేక సంవత్సరాల నుంచి అనేక ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనలు చేశారన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పి దాని స్థానంలో దుర్మార్గమైన జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ పథకం)ను తీసుకురావడం జరిగిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయం అంగీకారం కాదని తెలిపారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లలో పీఆర్సీ, కమ్యుటేషన్, కారుణ్య నియామకాలకు సంబంధించి స్పష్టత లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక భద్రతలను దృష్టిలో ఉంచుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ప్రసాదరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్ ఉమ, తెనాలి ప్రాంతీయ కార్యదర్శి డీవీ సుబ్బారావు, సీపీఎస్ కన్వీనర్స్ ఎన్.సుబ్బారావు, టి.శరత్ కుమార్, సీనియర్ నాయకులు డీపీ జోసెఫ్, కమతం శ్రీనివాసరావు, వై.శ్యాంబాబు, సాలార్ బేగ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యమైన ఎముకలు సాధ్యం

ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పౌష్టికాహారంతోనే ఆరోగ్యమైన ఎముకలు సాధ్యమని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సీహెచ్. విజయ్‌కుమార్ అన్నారు. ప్రతీ ఆదివారం జరిగే ఆరోగ్య సభలలో భాగంగా స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఎముకలు, కీళ్లు, కండరాల సమస్యలపై ఆరోగ్యసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్.విజయ్ కుమార్ మాట్లాడుతూ. ఎముకలకు సంబంధించిన సమస్యలలో ఆస్టియో పోరోసిస్ ఒకటని, ఈ వ్యాధి ఎక్కువగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులలో కనిపిస్తుందన్నారు. ఆస్టియో పోరోసిస్ సమస్య ముఖ్యంగా ఆడవారిలో మెనోపాజ్ అయిన తర్వాత హార్మోన్ సమతుల్యం దెబ్బతినడం వలన వస్తుందని తెలిపారు. ఈ ఆస్టియో పోరోసిస్ సమస్య సాధారణంగా శారీరక శ్రమ లేకపోవడం, విటమిన్-డి లోపం వలన వస్తుందని, ఈ సమస్య నుంచి బయటపడాలంటే రోజూ వ్యాయామం చేయటం, ప్రతి రోజూ ఉదయం సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో ఎండ తగిలేటట్లు గానూ..చేపలు, చేపకు సంబంధించిన పదార్థములు, పాల ఉత్పత్తులు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఆస్టియో పోరోసిస్ సమస్య లివర్, మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడే వారిలోనూ..కేవలం శాఖాహారం తీసుకునే వారిలో కూడా డి-విటమిన్ లోపించి ఆస్టియో పోరోసిస్ సమస్య తలెత్తుతుందన్నారు. క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పాల ఉత్పత్తులు, ఆకు కూరలు, కమలా, బొప్పాయి వంటి పండ్లు తీసుకోవాలని, మనం రోజూ శరీరానికి శ్రమ కల్పిస్తే మన ఎముకలు, కండరాలు బలంగా తయారై మోకాళ్ల నొప్పులు రాకుండా ఉంటాయని, లేకుంటే మన ఎముకలు, కండరాలు బలహీనపడి మోకాళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రోజూ ఒక అరగంట పొద్దున వాకింగ్ చేస్తే మోకాళ్ల నొప్పులు రాకుండా ఉంటాయని అన్నారు. పిల్లలకు ప్రోటీన్స్ ఆహారం ఇస్తూ, వారు కూర్చునే విధానాన్ని క్రమబద్ధీకరిస్తే నడుము నొప్పి నుంచి ఉపశమనం కలిగించవచ్చన్నారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం, కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ముప్పాళ్ళ ప్రసాదరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు చలమా రెడ్డి పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గురజాల అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.పి. నెం: 40 / 2024

బిట్వీన్:

పొట్ల వెంకట నారాయణ, తండ్రి. నరసింహారావు, శ్రీరాంపురం, గురజాల. ..... పిటీషనర్

మరియు

1)జమ్మిగుంపుల మల్లయ్య, 2) వంకాయలపాటి గోపి, 3) మద్దినేని వెంకట్రామయ్య, 4)గుండ్లపల్లి నారప రెడ్డి, 5) గుండ్లపల్లి గోపిరెడ్డి, 6) మిడతల ఆదిలక్ష్మి, 7) బోయ కీచ్చా రెడ్డి, 8)బోయ అన్నార్జమ్మ,9)కె.ఆర్.కె.మూర్తి,10)కించుపాటి నరసింహారావు,11)అయినాల శ్రీను,12)తోట అమర లింగయ్య, 13)నలబోతుల అక్కారావు, 14) పరిమి వెంకటేశ్వర్లు, 15) బొజ్జా రామారావు, 16)మంద్రు నాగేంద్రం, 17) కూరెల నాగేశ్వరరావు, 18)సన్యం సుజాత, 19) చిలకల ధరణి, 20) పాడి కోటేశ్వరమ్మ, 21)పులిచెర్ల వెంకట రెడ్డి, 22)బొడ్డపాటి నాగాంజనేయులు, 23) పాతూరి కొండలు, 24)కొనకంచి అనసూర్యమ్మ, 25)బొప్పూరి లక్ష్మి నారాయణ, 26)పొట్ల అమరలింగయ్య, 27)గుండెబోయిన నారాయణ,28)పాతూరి కోటయ్య, 29)బొడ్డపాటి నారాయణమ్మ, 30) పొట్ల నాగేశ్వరరావు, 31)లింగ వెంకటేశ్వర్లు, 32) పొట్ల శ్రీనివాసరావు @ శ్రీను, 33) వడ్లమూడి అంకమ్మ చౌదరి, 34)అయినాల రామారావు, 35) అయినాల వెంకటేష్, 36) కంచె నాగమణి, 37)గూడూరి లక్ష్మీ నారాయణ, 38)టి. వీరా రెడ్డి, 39) బొప్పూరి కోటేశ్వరమ్మ, 40) వుట్లా సాంబశివరావు, 41) జమ్మిగుంపుల వెంకయ్య, 42) పి.శివ నాగు, 43) పొట్ల సీతయ్య, 44) కంచె కోటయ్య, 45) వున్నం సుజాత 46)కె. నాగభూషణం, 47)పయ్యావుల పద్మావతి, 48)జమ్మిగుంపుల రాఘవరావు, 49) ఈదర సుబ్బారావు, 50)గంజికుంట రమాదేవి, 51)సాదినేని వెంకటేశ్వర్లు, 52)చింతా ప్రసాద్,53)వంకాయల ఆంజనేయులు, 54)మున్నం వెంకటరమణ,55)వున్నం శ్రీదేవి, 56) వున్నం సత్యనారాయణ, 57)గుండ సాంబశివరావు, 58) కందిమళ్ల శేషారావు, 59)బొడ్డపాటి సుబ్బయ్య, 60)వెన్నం జగ్గారావు, 61)పోల ప్రసాద్, 62)వేముల పెద పుల్లయ్య, 63) తూమాటి నరసింహారావు, 64)మీదాటి నాగయ్య, 65)రావిపాటి నాగేశ్వరరావు, 66) ముత్యాల కామేశ్వరి, 67)లింగాల మట్టయ్య, 68)ధూళిపాళ వెంకటేశ్వర్లు, 69)దొడ్డపాటి అంతయ్య, 70) పొట్ల కృష్ణారావు, 71)రావిపాటి సుబ్బమ్మ, 72)లింగా శ్రీను, సీతయ్య, 73)లింగా సీతారామయ్య,74)నేలవల్లి వెంకటేశ్వర్లు, 75)ముంద్రు నారాయణమ్మ, 76)నేలవల్లి ఆదెయ్య, 77) పులుకూరి సైదయ్య, 78)వడ్లమూడి శివ లక్ష్మి, 79)అయినాల పుల్లయ్య, 80)పొట్ల రాజేష్, 81)బొడ్డపాటి రామ కృష్ణ, 82) మేడికొండ రామకృష్ణ, 83)ఎ.నాగేశ్వరరావు, 84)అన్నవరపు సుబ్బారావు, 85)భవనారి రామలింగేశ్వరరావు, 86)తెల్ల సుబ్బారావు, 87)ఆకుల పిచ్చయ్య, 88)పెనుగొండ గురవయ్య.

....రెస్పాండెంట్లు

పైనెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని కోరుచు దాఖలుచేసిన పిటీషన్‌లో ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది:06-11-2024కి** వాయిదావేసినారు. కావున ఆరోజున **ఉ॥గం॥10:30ని॥**లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము).

వాయిదా తేది: **06-11-2024.**

బి.యన్.వి. హనుమంత రావు,

పిటీషనర్ తరపు అడ్వకేట్, గురజాల. సెల్: 9440447566

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు జరపాలి: రంగారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్స్ డే సందర్భంగా గుంటూరు మల్లయ్య లింగంభవన్ వద్ద ఆదివారం కొల్లి రంగారెడ్డి రైతు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నాయకులు పి.జగన్నాధం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనమాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతుల ప్రయోజనాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రైతాంగానికి ఇచ్చిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు, దేవాదాయ భూములు సాగు చేసే రైతులకు కార్డులు ఇచ్చి వారికి కూడా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కంజుల విఠల్ రెడ్డి, ముప్పాళ్ళ శివ శంకరరావు, నూతలపాటి చిన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, నాయకులు పూర్ణ, గోలి సాయి, శంకర్, అబ్రహం, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విశాలాంధ్ర-నరసరావుపేట: తూఫాన్ కారణంగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం దృశ్య జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, ప్రభుత్వ శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలల్లో కూడా నిర్వహించకూడదని విధిగా సెలవును అమలు చేయాలని ఆయన కోరారు.

ఫారెస్ట్ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-విజయపురి సౌత్: అటవీశాఖకు చెందిన భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనిల్ కుమార్ హెచ్చరించారు. చింతలతండాకు చెందిన కేతావత్ శంకర్ నాయక్ అనే వ్యక్తి చింతల తండా-సాగర్ ప్రధాన రహదారి లోని తన పొలం పక్కనే ఉన్న అటవీశాఖ భూమిని ఆక్రమించడంతో సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకొని శంకర్ నాయక్‌కు నోటీసులు అందజేశారు. ఆక్రమిత స్థలంలో అటవీ మొక్కలు నాటనున్నట్లు అనిల్ కుమార్ తెలిపారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

ఇళ్లను పరిశీలించిన బుర్రముక్కు

విశాలాంధ్ర-తాడేపల్లి : వర్షాలకు తాడేపల్లి సలాం సెంటర్, పోతురాజు గుడి, రన్నింగ్ రూమ్, కాలనీల్లో ఇళ్ళు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న వైసీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి ఆదివారం సలాం సెంటర్, పోతురాజు గుడి, రన్నింగ్ రూమ్ కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బీసీ నాయకులు బత్తుల దాసు, ఉప్పు శీను, కొండ, రవీంద్ర పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి మాస్టర్ ప్లాన్

వరద బాధితులకు లోకేశ్ పరామర్శ

విశాలాంధ్ర-మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. భారీవర్షాల కారణంగా మంగళగిరి నియోజకవర్గంలో ముంపునకు గురైన తాడేపల్లి నులకపేట క్వారీ ఏరియా, మంగళగిరి రత్నాల చెరువు, దీన్ దయాళ్ నగర్, టిడ్కో కాలనీ ప్రాంతాలను మంత్రి లోకేశ్ ఆదివారం పరిశీలించారు. మంగళగిరి కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని లోకేశ్ పరిశీలించారు. కొండచరియలు విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ భౌతికకాయానికి నివాళులర్పించిన లోకేశ్... కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం చెక్కు అందజేశారు. రత్నాలచెరువులో మోకాలిలోతు వర్షపునీటిలో దిగి ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. చేనేత కార్మికుడి ఇంటికి వెళ్లి మగ్గం గుంటల్లో చేరిన నీటిని పరిశీలించారు. ప్రభుత్వం తరపున అందిస్తున్న సహాయ కార్యక్రమాలను వాకబు చేశారు. అధికారులు, పార్టీ శ్రేణులు నిన్నటి నుంచి అందుబాటులో ఉండి ఆహారం, తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. ఇళ్ల మధ్య చేరిన నీటిని ఆయిల్ మోటార్లు ఏర్పాటు చేసి వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. స్థానికులు తాగునీటి సమస్యను ప్రస్తావించగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ముంపు ప్రాంతాల పరిశీలన అనంతరం సహాయ చర్యలపై మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి లోకేశ్ అధికారులతో సమీక్షించారు. లోకేశ్ మాట్లాడుతూ... వచ్చే వారం రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు.

మేధాశక్తికి అద్దంపట్టిన యూసీ మాస్ విద్యార్థులు

అబ్బురపరచిన ఏఐ ఆవిష్కరణలు: పార్థసారథి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతి రోడ్డు ఏ కన్వెన్షన్‌లో ఓ బోట్జ్ రోబోటిక్స్ అండ్ కోడింగ్ 5వ ఒలంపియాడ్ ద్వారా యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం (యూసి మాస్) విద్యార్థులు తమ మెదళ్లకు పదును పెట్టి తయారు చేసిన రోబోటిక్స్ చంద్రయాన్, అగ్రికల్చర్ రోబో, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, స్మార్ట్ విలేజ్, క్యారం రోబోట్, వంటి వందలాది ప్రదర్శనలు తల్లిదండ్రులను, చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి కెఎల్ యూనివర్సిటీ బేసిక్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.పార్థసారథి మాట్లాడుతూ చిన్న వయసులోనే రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అబాకస్ వంటి సాంకేతిక విద్యను పిల్లలలో నేర్పించడం ద్వారా భవిష్యత్తు మేధో సంపన్న శాస్త్రవేత్తలుగా రాణిస్తారన్నారు. శ్రీరైన టెక్నాలజీస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలతోనే ముడిపడి ఉందన్నారు. యూసీ మాస్ శిక్షణ ద్వారా 6 సంవత్సరాల వయసు నుంచి 18 సంవత్సరాల విద్యార్థులకు 500కు పైగా రోబోట్ మోడల్స్‌పై కోడింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, గణితంలో అబాకస్ 3 సంవత్సరాల శిక్షణల ద్వారా ప్రత్యేక గ్రాడ్యుయేషన్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. వీవీఐటీ ప్రొఫెసర్ డివి శేషగిరిరావు, పీపుల్స్ ట్రామ డాక్టర్ కె.వెంకటేశ్వర్ రెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఓవి రామిరెడ్డి, ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ ఎం.శ్రీకాంత్ టెక్నికల్ మోడరేటర్స్ రమా, పూజ, నందిని, మహాలక్ష్మి, లీలామణి, జ్యోష్న, జ్యోతి, జీవన తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుతోనే ముంపు సమస్యలకు పరిష్కారం : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జనావాసాల్లో చోటుచేసుకున్న ఆక్రమణల తొలగింపు, డ్రెయినేజీల్లో పూడిక తీతతోనే భారీవర్షాల సమయంలో ముంపు సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కుండపోత కారణంగా చిలకలూరిపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించారు. గడియార స్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్, మార్కెట్ సెంటర్‌లో వరదనీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, డ్రైనేజీలు పరిశీలించి మున్సిపల్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆక్రమణల తొలగింపుతో పట్టణంలో కొంతమంది బాధపడ్డా మెజార్టీ ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారని తెలిపారు.

ఆగిన వర్షం.. ఊపిరి పీల్చుకున్న జనం

విశాలాంధ్ర-పెదనందిపాడు : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షంతో ఇబ్బందులు పడ్డ జనం ఆదివారం శాంతించటంతో ఊపిరి పీల్చుకున్నారు. శనివారం కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నల్లమడ వాగుసమీపంలో నివాసితులు ఇబ్బందులకు గురయ్యారు. పెదనందిపాడు బస్టాండ్ నుండి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి చెరువును తలపించింది. ముఖ్యంగా గ్రామాలలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరణికోటలో కలెక్టర్, ఎస్పీ పర్యటన

విశాలాంధ్ర-అమరావతి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలతో పాటు మండల పరిధిలోని లంక గ్రామాలలో పూర్తిస్థాయిలో నీటిలో మునిగిపోవటాన్ని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామాన్ని సందర్శించారు. అనంతరం అమరావతి మండల పరిధిలో ఉన్న మూడు గ్రామాలకు చెందిన లంక భూములలో గత రెండు నెలల నుంచి అక్కడే ఉంటూ గొర్రెలను మేపుకుంటున్న 36 మందిని అలాగే పశువులు, గొర్రెలు 1500 పైచిలుకు మూగజీవాలను ధరణికోటలోనే సురక్షిత బోర్డు సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లా ప్రాంతంలో ఎక్కువ శాతం అచ్చంపేట, అమ రావతి మండల ప్రాంతాలలో, అలానే నరసరావుపేట డివిజన్ ప్రాంతంలో వర్షాలు కురవడం వలన లోతట్టు ప్రాంతాలు జలమయం అవటంతో జనజీవనానికి తీవ్ర ఇబ్బంది వాటిల్లిందన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ రెవెన్యూ అధికారి యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు తెలిపారు. కృష్ణ పరివాహ ప్రాంతమైన నాగార్జున సాగర్ నుంచి దిగువ ప్రాంతానికి, అలాగే ఎగువ ప్రాంతమైన తెలంగాణలో కురిసిన వర్షం కారణంగా కృష్ణానది ఉధృతికి లోతట్టు ప్రాంతం జలమయమయ్యే పరిస్థితి ఉన్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంత ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సహాయ చర్యల్లో నిమగ్నం అవ్వాలని ఆదేశాలు జారీచేశారు. వరదల కారణంగా ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా యావత్తు ప్రభుత్వ యంత్రాంగం సహాయ చర్యలు చేపట్టేందుకు సమాయత్తం అయినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓ మేకల హనుమంతరావు, మల్లాది విష్ణు, గ్రామ సర్పంచ్ ఎం.పావని, రాంబాబు పాల్గొన్నారు.

నీట మునిగిన డీవీసీ కాలనీ

విశాలాంధ్ర- పొన్నూరు: భారీ వర్షాలకు పొన్నూరు పట్టణం లోని ఏడో వార్డు డివిసి కాలనీ నీట మునిగింది. కాలనీ పక్కన మురుగు తుంగభద్ర డ్రెయిన్ పొంగిపొర్లి కాలనీలో నీరు చేరటంతో ప్రజలు రెండు రోజుల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. తుంగభద్ర డ్రెయిన్ కట్టలు ఆక్రమణలకు గురికావడంతో ప్రతిసారి డివిసి కాలనీ ముంపుకు గురికావడం పరిపాటిగా మారింది.

నీట మునిగిన పొలాల పరిశీలన

విశాలాంధ్ర, తెనాలి : మండలంలో నీట మునిగిన వరి పొలాలను ఆదివారం జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత మేరకు నీటిని బయటకు పంపించి ఎరువులు పిచికారి చేయాలని రైతులకు తగిన సూచనలు సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్, తెనాలి సబ్ డివిజన్ సహాయ సంచాలకులు యం.ఉషారాణి, యంపిఈఓ ఆల్ఫీ, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు చేపట్టాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: వాయుగుండం ప్రభావంతో పలనాడు జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాల కారణంగా ప్రజలు అంటువ్యాధులు, కాలనుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తముగా ఉండి, తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి అన్నారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి వడపోసి చల్లారిన తర్వాత మాత్రమే తాగాలని అన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్న దగ్గరలోని పీహెచ్‌సి లేక యుహెచ్‌సి లేక మరియే ఇతర ప్రభుత్వ వైద్య శాల యందు కానీ సమాచారం ఇచ్చి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ రవి సూచించారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : తుఫాను ప్రభావం ఇంకా ఉన్న నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రేషన్ సకాలంలో అందించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారులను ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. శానిటైజేషన్ రేషన్ సకాలంలో అందించాలని, వరద పెరిగే అవకాశం ఉన్నందున వరద పెరిగితే గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పార్టీ శ్రేణులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

విశాలాంధ్ర-దుర్గి: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రతీ పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రమైన దుర్గిలో ఆదివారం ప్రతీ పైరును ఆయన పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని తీసివేసి అంతర కృషి చేసి భూమి ఆరేలా చూడాలని, కాయకుళ్ళు ఉన్నచోట ప్రోఫికోనజోల్ 1 మి.లీ./ లీటరు నీటికి కలిపి పైరులో పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఇస్మాయిల్

విశాలాంధ్ర-వినుకొండ: పురపాలక సంఘం శానిటరీ ఇన్స్పెక్టర్ గా ఎస్.కే. ఇస్మాయిల్ నియామకం అయ్యారు. చిలకలూరిపేటలో విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌ను వినుకొండకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇస్మాయిల్ వినుకొండ నుంచి చిలకలూరిపేట బదిలీపై వెళ్లారు, ఇప్పుడు మరలా చిలకలూరిపేట నుంచి వినుకొండకు బదిలీ అయ్యారు.

పొలాలు మునక.. రైతుల ఆందోళన

విశాలాంధ్ర-అమరావతి : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అమరావతి మండల పరిధిలోని లోతట్టు ప్రాంత పొలాలు నీట మునగటంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎగుప్రాంతం నుంచి కృష్ణా నదికి వస్తున్న వరద నీటి ప్రవాహం వల్ల కృష్ణానది అమరేశ్వర ఆలయ ప్రాంతాల్లో పైమెట్ల వరకు నీరు రావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక శాసనసభ్యులు ధరణికోటలోని జైలెసింగ్ కాలనీ నీట మునగటంతో కాలనీ సందర్శించిన అనంతరం లంక భూముల్లో ఉన్న గొర్రెల పెంపకందారులను పరామర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఆయా శాఖ అధికారులతో సమావేశమై వరద వర్షాల కారణంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా రెవిన్యూ ఆయా శాఖ అధికారులు సమయత్వం కావాలని కోరారు.

పంటలు పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: పట్టణ, మండల పరిధిలోని పలు పంటపొలాలను వ్యవసాయ అధికారులు ఆదివారం పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన ప్రతి పంట పొలాలను పరిశీలించిన పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు రవి కుమార్ మాట్లాడుతూ మండల అంతటా అధిక వర్షాలు కురిసిన కారణంగా రైతులు ప్రత్తి, వరి పంటలలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు గూర్చి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇంచార్జీ సహాయ వ్యవసాయ సంచాలకులు యస్ శ్రీధర్ రెడ్డి, నందిగామ వ్యవసాయ సహాయకుడు గోపాలం గోపి కృష్ణ, సత్తెనపల్లి మండల తెలుగు దేశ పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు నాయకులు తాతినేని రంగా, రైతులు పాల్గొన్నారు.

నేడు పరిష్కార వేదిక రద్దు

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు పరిచినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉండాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: భారీ వర్షాలు, వరదపరిస్థితుల నేపథ్యంలో సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. వరద నష్టం, సత్వర సహాయక చర్యలపై ఆదివారం హైదరాబాద్ నుంచి అధికారులతో ఆయన సమీక్ష చేశారు. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, జలవనరులు, విద్యుత్, పోలీస్ సహా పలు శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. రైతులకు పంట నష్టం విషయంలో వేగంగా స్పందించాలని ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ అధికారులకు సూచించారు. పంటలపై వర్షాల ప్రభావం, రైతుల పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరీ ముఖ్యంగా మంచినీరు, పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వైద్యారోగ్య విభాగం అధికారులు ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలపై పూర్తి సన్నద్ధతో ఉండాలని ఆదేశించారు. జ్వరబాధితులు, అనారోగ్యంతో వచ్చే వారికి అన్ని వేళలా వైద్యసేవలు అందేలా ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు లేరు, మందులు లేవు అన్న మాట రాకూడదని, అవసరమైన అన్నీ సమకూర్చి పెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్&బీ శాఖల పరిధిలో ఎక్కడైనా రోడ్లు దెబ్బతిని ఉంటే తక్షణం మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎక్కడా రాకపోకలకు అంతరాయం ఉండకూడదని... ప్రజల ఫిర్యాదులపై విద్యుత్ విభాగం అధికారులు వేగంగా స్పందించాలన్నారు. అలానే రెవెన్యూ విభాగం తరపున సహాయ చర్యలకు సమన్వయం చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. స్థానికంగా దెబ్బతిన్న నీటి వనరుల వివరాలు సేకరించి అవసరమైన చర్యలకు జలవనరుల శాఖ విభాగం కూడా సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. ఒక వేళ ఎక్కడైనా సమస్య పెద్దది అయితే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

విశాలాంధ్ర-వినుకొండ: ఇందిరా నగర్‌కు చెందిన ఒడియ రాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంకాలమ్మ బోనాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇందిరానగర్ నుంచి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఇళ్ల వద్ద పొంగళ్ళు వండుకొని ర్యాలీగా నరసరావుపేట రోడ్డు నుండి శివయ్య స్తూపం సెంటర్ మీదుగా, పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డు నందు గల అంకాలమ్మ దేవస్థానం నందు వారి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ తదితర చెరువులన్నీ నిండి కలకలాడుతున్న ఈ తరుణంలో పట్టణానికి చెందిన వడియ రాజులు తరతరాలుగా ప్రతి సంవత్సరం వర్షాల కురవాలని అమ్మవారికి మొక్కులు తీరుస్తున్నారని, ఇదో సంప్రదాయమని అన్నారు. టిడిపి నాయకులు పీవీ సురేష్, పత్తి పూర్ణ, సౌదాగర్ జానీ భాష, ఒడియ రాజుల సంఘం అధ్యక్షులు చల్ల కుమార్, ట్రెజరర్ ఎర్ర వాసు, ఉప సర్పంచ్ దేవల్ల యేసు పాదాలు, సెక్రెటరీ ప్రసాదు, దేవుళ్ళ గోవిందు, సంఘం పెద్దలు బత్తుల శ్రీను, తమ్మిశెట్టి వెంకటస్వామి, బందారు వెంకట కోటయ్య, తురక ఏడుకొండలు, వేముల గోవిందు, చల్ల శివయ్య, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

విశాలాంధ్ర-వినుకొండ: ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను రాయల్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా పూర్తి చేశారు. మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు పాల్గొని మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని జనసేన నాయకులు కె.నాగ శ్రీను ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. పవన్ పుట్టినరోజు సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం జనసేనను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు గెలుపు కోసం జనసేన నాయకులు కే నాగ శ్రీను జనసేన యువత ఎంతో శ్రమించారని ఈ సందర్భంగా మక్కెన కొనియాడారు. అలాగే రక్తదానం చేసిన యువతకు ఆసుపత్రి డాక్టర్ల బృందానికి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలకు మక్కెన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షమీంఖాన్, టిడిపి కౌన్సిలర్ బాల గురవయ్య, హాస్పటల్ సిబ్బంది, వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధి పారెళ్ళ అభిమన్యు, శావల్యాపురం మండల అధ్యక్షుడు కడప అనిల్ కుమార్, నూజెండ్ల మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి రాజాబాబు, వినుకొండ మండల అధ్యక్షుడు గండికోట మణికంఠ, బొల్లాపల్లి మండల ఉపాధ్యక్షుడు యర్రం శెట్టి వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, మెగా అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

రోడ్డుపై జారిపడ్డ కొండ రాళ్ళు

విశాలాంధ్ర-నరసరావుపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పల్నాడు జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొండవీడు ఘాట్ రోడ్డుపై కొండ రాళ్లు విరిగి పడ్డాయి. దీంతో కొండవీడు నగరవనం సందర్శనకు వెళ్లే ఘాట్ రోడ్డును సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్ రామచంద్రరావు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు ఘాట్ రోడ్డుపై పడిన కొండ రాళ్లను ఆర్అండ్‌బి అధికారులు యుద్ధ ప్రాతిపదికపై తొలగిస్తున్నారని అన్నారు.

రేషన్ షాపు తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టపరిచి, ప్రతి ఒక్కరికీ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోనీ 6వ వార్డ్‌లో ఉన్న రేషన్ షాపుని ఆదివారం డాక్టర్ అరవింద బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల కోసం రేషన్ షాపుకు వచ్చిన ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో కార్డుదారులకు ఎనిమిది రకాల సరుకులు అందిస్తే జగన్ రెడ్డి నాశనం చేశాడని ధ్వజమెత్తారు. పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వం తక్షణ కర్తవ్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్తంభించిన రాకపోకలు

విశాలాంధ్ర-రెంటచింతల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గుంటూరు-మాచర్ల రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. రెంటచింతల గోలివాగు డైవర్షన్ వంతెనపై నుండి వర్షపు నీరు ప్రవహిస్తుంది. శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు మాచర్ల నుండి గుంటూరు వెళ్లేందుకు వాగులోకిరాగానే ఇరుక్కుపోయింది. క్రేన్ సహాయంతో తొలగించారు. ఆదివారం పోలీసులు పూర్తిగా వాహనాలను నిలిపివేశారు. వంతెనకు రెండు వైపులు పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచాయి. మాచర్ల నుండి కారంపూడి మీదుగా గుంటూరుకు ఆర్టీసీ బస్సులు ఆదివారం నడిచాయి. మిట్టగుడిపాడు, గోలివాగు, రెండు పిల్లివాగులు, కూడా ఉధృతంగా ప్రవహించటంతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాగు సమీపంలోని మాగాళ్లు నీట మునిగాయి.

పంట నష్టం జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ

విశాలాంధ్ర-మాచర్ల: కురుస్తున్న భారీ వర్షాలకు పైర్లకు నష్టం జరగకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు పొలాల్లో నీరు నిలబడితే పత్తి పైరు ఎర్రబారే అవకాశాలు ఉన్నాయన్నారు. వరకాలువలు తీసి వర్షపు నీటిని పొలం నుండి తొలగించాలన్నారు. 90 రోజుల లోపు వయసు వున్న పత్తి పొలంలో ఒక ఎకరానికి బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలి. అదేవిధంగా మల్టీ-కె (13.0.45) 10 గ్రాములు లేదా పోలీఫీడ్ (19:19:19) 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారితో పాటు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. ఒకవేళ పత్తి పైరుకి గూడ, పూత రాలుతుంటే ప్లానోఫిక్స్ 1 మి.లీ/ 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసుకుంటే మంచిదన్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్న పైరుకు ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ళు ఆశించే అవకాశం ఉందని, అటువంటి పైరుకు సిఓసి 30 గ్రాములుం ప్లాంటమైసిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేస్తూ కాయకుళ్ళు వున్నచోట ప్రోపికోనజోల్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే మంచిదన్నారు. వర్షం ఆగేంత వరకూ రైతులు పంట పొలాలపై దృష్టి సారించి పైరులో జరుగుతున్న మార్పులపై మండల వ్యవసాయ అధికారుల ద్వారా సూచనలు పొంది పంటలను కాపాడుకోవాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన కోడూరి మాన్విత్(9) శనివారం మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఉప్పలపాడు గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను ఆదివారం పరిశీలించడానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ మాన్విత్ కుటుంబ సభ్యులను కలి సారు. వారిని ఓదార్చి ప్రభుత్వం తరపున అందవలసిన రూ.5 లక్షల చెక్కును ఆ కుటుంబానికి అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-పొన్నూరు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం భారీ వర్షాలకు నీట మునిగిన పలు గ్రామాలలోని పంట పొలాలను పరిశీలించారు. మాచవరం, ములుకుదురు, గోళ్లమూడిపాడు, మునిపల్లె, పీటీ పర్రు, వెల్లలూరు గ్రామాలలోని పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండల పరిధిలో ఎన్ని హెక్టార్లలో పంట పొలాలు నీట మునిగాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేయాలని సూచించారు. రైతులను ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

నాగరత్నమ్మకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని గండాలయ పేటలో కొండరాయి విరిగి పడి మృతి చెందిన సీపీఐ సానుభూతిపరురాలు నాగరత్నమ్మకు సీపీఐ నాయకులు బత్తూరి మోహనరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి కొండరాయి విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, కాకర్ల నరసింహారావు పాల్గొన్నారు.

నీళ్లల్లో నానుతున్న పంట పొలాలు

విశాలాంధ్ర-తాడికొండ : వాయుగుండం ప్రభావంతో నిత్యం కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీళ్లలో నానుతున్నాయి. గడిచిన రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలతో పాటు మెట్ట ప్రాంతాల్లో సైతం పంట పొలాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వరద ఉధృతికి పంట పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా పత్తి, మినుము, పెసర, జూటు, వరి పంటలకు తీవ్రనష్టం జరిగింది. తాడికొండలోని అక్కదేవతల చెరువు, కొండవీటి వాగు పొంగిపొర్లాయి. వర్షం ధాటికి ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, ముప్పాళ్ళ శివశంకరరావు, గుర్రంకొండ సత్యానందం, ఖమ్మంపాడు దేవుని దయ ప్రభుత్వాన్ని కోరారు.

కొండరాళ్లు పడిన ప్రాంతం పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి : గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాడేపల్లి పట్టణంలోని పోలకంపాడు ప్రాతంలో కొండచరియలు పెద్ద పెద్ద బండలు కుక్కల కుమారి ఇంట్లో పడ్డాయి. ఆదివారం వైసీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి పోకంపాడు ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు.

ఉత్తమ కమ్యూనిస్టు.. కామ్రేడ్ సర్వారెడ్డి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉత్తమ కమ్యూనిస్టు కామ్రేడ్ బుర్రముక్కు సర్వారెడ్డి అని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో(నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో) కామ్రేడ్ బుర్రముక్కు సర్వారెడ్డి 10వ వర్ధంతి సభ సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కామ్రేడ్ బుర్రముక్కు సర్వారెడ్డి, తాడేపల్లి ప్రాంతంలోని పేద ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేసారని, తాడేపల్లి ప్రాంతంలో రైల్వే, కొండ పోరంబోకు ప్రాంతాలలో నివసిస్తున్న పేదలకు సీపీఐ తరపున అండగా నిలిచారని అన్నారు. సీపీఐ అభివృద్ధి కోసం సర్వారెడ్డి కృషి చేశారని అన్నారు. తాడేపల్లి రైల్వే స్థలాలలో కొండ పోరంబోకు స్థలాలలో కాలవగట్ల ప్రాంతాలలో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని ఇళ్ల పట్టాలు లేని వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని వారికి అండగా నిలిచి ఆదుకోవాలని అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సర్వారెడ్డి తన తదిశ్వాస వరకు ఏ సిద్ధాంతాన్ని ఏ పార్టీని నమ్ముకున్నాడో ఆ పార్టీ పతాకాన్ని పార్థివ దేహం మీద కప్పుకొని కమ్యూనిస్టు ఉద్యమం కోసం మమేకమయ్యారని అన్నారు. ఉత్తమ కమ్యూనిస్టుగా సర్వారెడ్డి పార్టీ కోసం సేవలందించారని అన్నారు. రైతు సంఘం ఉద్యమాలలో, కమ్యూనిస్టు ఉద్యమాలలో సర్వారెడ్డి కీలకమైన భూమిక పాత్ర పోషించారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసే ప్రతి కార్యక్రమంలో ముందుండి నడిచేవారని అన్నారు. సర్వారెడ్డి ఆశయాలను ముందుకు కొనసాగిస్తామని అన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం పునరాభివృద్ధి కోసం మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధి కోసం ఆయన చేసిన ఆయన చూపిన మార్గాన్ని ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, షేక్ కాశీం, షేక్ బాషా, కర్రి సురేష్, చల్ల ప్రసాద్, ఎం.చిన్నా తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త తలం విజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాలలో పని చేసినా గాని దేశంలో రైతు బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందన్న ఆలోచనతో రైతు సాధికార సంస్థ ద్వారా సాంప్రదాయ వ్యవసాయానికి విశేషంగా కృషిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి తల్లం విజయ్ కుమార్ దేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్తని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్డు హోటల్ వెల్కమ్ సమావేశ మందిరంలో సాంప్రదాయ వ్యవసాయ పరిశోధనలలో విశేషంగా కృషి చేసినందుకు పోర్చుగీస్ దేశం ప్రతిష్టాత్మకమైన "గుల్బెన్ కియన్" అవార్డుతో సత్కరించిన సందర్భంగా సత్కర సభ నిర్వహించారు. సభకు బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ వైస్ చైర్మన్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి శ్యాం సుందర్ అధ్యక్షత వహించారు. రైతు నేస్తం ఎడిటర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు మౌలికమైన వాతావరణ మార్పులను అధ్యయనం చేస్తూ రసాయనాల భారీ నుండి భూమిని కాపాడుకునే ప్రయత్నాలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్ మాట్లాడుతూ గ్లోబల్ ప్రోగ్రెస్ కోసం నోబెల్ బహుమతితో సమానమైన గుల్బెంకియన్ అవార్డు కోసం 117 దేశాలు పోటీపడగా విజయ్‌కుమార్‌ను ఈ అవార్డుకు అర్హత ప్రకటించడం దేశంతో పాటు తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో బొమ్మిడాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణ మూర్తి, ఫార్ప్యూన్ మురళి పార్క్ ఎండి ముత్తవరపు మురళీ కృష్ణ, పలువురు ఐసిఎంఆర్ శాస్త్రవేత్తలు, లాం వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: కొల్లి

విశాలాంధ్ర-తాడికొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి కోరారు. పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 1936లో రైతు సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు కొనసాగించటం జరిగిందన్నారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతుల ప్రయోజనాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా మోదీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తుఫాను సందర్భంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉమ్మడి గుంటూరు జిల్లాలో తుఫాన్, వరద, ప్రకృతి వైపరీత్యాల వలన మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా కాచి చల్లార్చిన నీరు లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలని, భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, అలాగే ఈగలు వాలిన ఆహార పదార్థాలు..చెడిపోయిన ఆహార పదార్థాలు గానీ..నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, పానీయలు గానీ..పాడైన చెడిపోయిన కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసము తినరాదన్నారు. మల విసర్జనకు తప్పనిసరిగా వ్యక్తిగత మరుగు దొడ్లు లేదా సామాజిక మరుగు దొడ్లు మాత్రమే వినియోగించా లని, బహిరంగ ప్రదేశాలలో చెడిపోయిన ఆహార పదార్థాలు గానీ.. చెత్త చెదారాన్ని పార వేయరాదని, అప్పుడే వండిన ఆహా ర పదార్థాలను..తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవా లన్నారు. వండిన ఆహార పదార్థాలపై.. మంచినీటిపైన మూతలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఇంటి లోపల ఇంటి బయట పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైనట్లయితే సమీపంలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని, ప్రాథమిక ఆసుపత్రి లేదా పట్టణ ఆరోగ్య కేంద్రాన్నిసందర్శించి వైద్య సహాయాన్ని పొందాలని కోరారు.

తెనాలిలో మంత్రి పర్యటన

విశాలాంధ్ర-తెనాలి : మంత్రి నాదెండ్లమనోహర్ తెనాలిలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని సిఎం కాలనీలో వరద నీటిని కాలువలను రోడ్లను పరిశీలించారు. కాలనీ వాసులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అదేరీతిలో ఉద్యోగస్తులను కూడా వార్డులలో వర్షాలు కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ డ్యూటీ సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రామాపురంలో పునరావాస కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-దాచేపల్లి: కృష్ణా నది పొంగి ప్రవహించడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. నీటి ప్రవాహం పుష్కర మెట్లు దాటి బెస్త వారి కాలనీలోని ఇళ్ళలోకి చేరుకున్నాయి. స్థానిక రామాలయం సహా సమీపంలోని పత్తి, మిర్చి తదితర పంట పొలాలన్నీ నీట మునిగాయి. దాంతో తహశీల్దార్ కుటుంబరావు, సీఐ వెంకట్రావు శనివారం అర్ధరాత్రి కాలనీకి చేరుకొని అక్కడి వారందరినీ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి తరలించారు. పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందరికీ భోజన వసతులు కల్పించారు. 129.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెస్త వారు మాట్లాడుతూ 50 ఏళ్ళుగా నివశిస్తున్నాం. 55 కుటుంబాలు జీవనం గడుపుతున్నాం. 200 పైగా ఓటర్లు ఉన్నాం. ప్రభుత్వాలు వస్తున్నాయి, పోతున్నాయి తప్ప మిమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎగువ ప్రాంతంలో స్థలాలిచ్చి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.